హడలెత్తిస్తున్న ఆటో వాలాలు!

- మితిమీరిన వేగంతో ప్రమాదాలు
- డ్రైవర్ల అవతారం ఎత్తుతున్న మైనర్లు
- హిల్స్‌లో పెరుగుతున్న ఆటోవాలాల ఆగడాలు
- ఆందోళనకు గురవుతున్న ప్రయాణికులు

" శంషాబాద్‌కు చెందిన ఓ కుటుంబం తెల్లవారు జామున బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1 నిమ్స్ ఎదురుగా రోడ్డు దాటుతోంది. రోడ్డు మీద పెద్దగా ట్రాఫిక్ కూడా లేదు. ఇదే సమయంలో మాసబ్‌ట్యాంక్ నుంచి వేగంగా దూసుకొచ్చిన ఓ ఆటో డ్రైవర్ రోడ్డు దాటుతున్న కుటుంబంలోని సాయి అనే ఏడేళ్ల బాలుడిని ఢీకొట్టడంతో అతను మృతి చెందాడు."

" ఇందిరానగర్ ప్రధాన రహదారిపై ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా, రాంగ్ రూటులో వచ్చిన ఆటో డ్రైవర్ అతడిని తాకుతూ పక్క నుంచి వాహనాన్ని తీసుకువెళ్లాడు. దీంతో ఆ వ్యక్తి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఆటో డ్రైవర్‌పై నిర్లక్ష్యపు డ్రైవింగ్ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. "

బంజారాహిల్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హిల్స్ రోడ్లపై ఆటో వాలాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. నిబంధలనకు విరుద్ధంగా రోడ్లపై దూసుకుపోతున్న ఆటోలను చూసి ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు లైసెన్సులు లేకుండానే ఆటోలు రోడ్లపైకి తెస్తుంటే, మరికొన్ని ప్రాంతాలలో మైనర్లు సైతం ఆటోలను నడుపుతున్నారు. దీంతో రోడ్లపై తరచూ ప్రమాదాలు జరిగి అమాయకపు ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.

● ఇందిరానగర్, ఫిలింనగర్, ఖాజానగర్, భోళానగర్ ప్రాంతాల్లో ఆటోల సంఖ్య గణనీయంగా పెరిగింది. వివిధ బస్తీలకు వెళ్లేందుకు ఇక్కడి నుంచి షటిల్ ఆటోలను నడుపుతున్నారు. ఇందిరానగర్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, ఫిలింనగర్, రోడ్డు నెంబరు 10 ఉదయ్‌నగర్ వైపు వెళ్లే వారు ఆటోలను వినియోగిస్తుంటారు. అలాగే వీరిని నమ్ముకొని వివిధ జిల్లాల నుంచి వలస వచ్చిన నిరుద్యోగులు ఆటోలను నడుపుతున్నారు. అయితే ఆటో కొనే స్తోమత లేని కొందరు స్థానికంగా ఉన్న ఆటో యజమానుల నుంచి ఆటోలను గంటలు, రోజుల చొప్పున అద్దెకు తీసుకుని ఎలాంటి లైసెన్సు లేకుండానే నడిపిస్తున్నారు.

●డబ్బులు వస్తున్నాయనే ఆశ, ఆటో కోసం వచ్చిన వారి దీనావస్థను చూసిన ఆటో యజమానులు సైతం నియమాలను ఏమాత్ర పట్టించుకోక కొన్ని హెచ్చరికలు చేస్తూ వారికి ఆటోలను ఇస్తున్నారు. దీంతో ఎలాగైన డబ్బులు సంపాదించాలనే ఆశతో వచ్చిరానీ డ్రైవింగ్‌తో ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని రయ్యిమంటూ దూసుకుపోతున్నారు.

● ఇందిరానగర్ నుంచి యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, కృష్ణానగర్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజాగుట్ట తదితర ప్రాంతాలలో ఆటోలలో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా ఆ ప్రాంతాలలోనే దృష్టి సారించి గిరాకీ కోసం ఎగబడుతున్నారు. లైసెన్స్‌లు లేకుండా నడపడమే కాకుండా నిబంధలనకు విరుద్ధంగా ఓవర్‌లోడ్ వేసుకుంటున్నారు. ముందు డ్రైవర్ సీటు వద్ద రెండు వైపులా ముగ్గురు ప్రయాణికులను కూర్చొబెట్టుకుని యథేచ్ఛగా నడుపుతున్నారు. అయితే తొందరగా గమ్య స్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో ఆ ఆటోలు ఎక్కుతున్న ప్రయాణికులు మాత్రం ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకు వస్తుందోనని ఆటో దిగే వరకు ఆందోళనకు గురవుతున్నారు.


ఇందిరానగర్‌లో నడిరోడ్డు మీద ఆటోలు (ఫైల్)

పెరుగుతున్న ప్రమాదాలు

అనుభవం, లైసెన్సు లేకుండా ఆటోలు నడపడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. నిబంధనల ప్రకారం 18 ఏళ్ల వయసు దాటిన వారు మాత్రమే ఆటోలు నడపాలి. కానీ ఇక్కడ 15 ఏళ్ల లోపు వారు కూడా ఆటోలు నడుపుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ తంతు ఎక్కువగా జరుగుతోంది. లైసెన్సు లేకుండా ఆటోలు నడిపే చాలా మంది డ్రైవర్లు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాత్రి వేళల్లో ఆటోల్లో ప్రయాణించేందుకు మహిళలు భయపడున్నారు.

విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు

ఫిలింనగర్ రౌండ్ టేబుల్ స్కూల్ వద్ద ఆటో వాలాల ఆగడాలు పెరుగుతున్నాయి. స్కూల్ విద్యార్థులను వారు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పాఠశాల సమయంలో హారన్ మోగిస్తూ ఉపాధ్యాయుల బోధనకు అవాంతరం కలిగిస్తున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

- నాగరాజు, ఫిలింనగర్

నడి రోడ్డుపై ఆటోలను నిలుపుతున్నారు

ఇందిరానగర్‌లో షటిల్ ఆటో వాలాలు నడి రోడ్డుపైనే ఆటోలను నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. గ్రీన్ బావర్చీ ఎదురుగా ఉండే ఆటో వా లాలు ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకొ నేందుకు అతిగా వ్యవహరిస్తున్నారు. రాత్రి కొందరు ఆటోవాలాలు మద్యం తాగి గోలు చేస్తున్నారు. వీరి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలి.

-బాబాగౌడ్, ఇందిరానగర్

లైసెన్స్ లేకపోతే ఆటోలు సీజ్ చేస్తున్నాం

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. మైనర్లు ఆటోలు, ఇతర వా హనాలను నడుపుతూ పట్టుపడితే వాహనా లను స్వాధీనం చేసుకుంటున్నాం. వారితో పాటు వారి తల్లిదం డ్రులను, వాహన యజమానికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వారిని న్యాయస్థానంలో హాజరుపర్చి కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు శిక్షలు అమలు చేస్తున్నాం.

-బలవంతయ్య, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సీఐ

డిజిటల్ కార్డుల సర్వేలో సగం మంది కూడా లేరు!

ఖైరతాబాద్,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మల్టీపర్పస్ డిజిటల్ కార్డులను అందజేయాలనే ఆలోచనతో పైలట్ ప్రాజెక్టు కింద చేసిన సర్వేలో సగం మందికి పైగా సంబంధిత ప్రాంతాల్లో ఉండట్లేదని తేలింది. ప్రతి నియోజకవర్గంలో ఒక ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టు కింద సర్వే చేయించగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో లక్ష్మీనగర్‌ను ఎంపిక చేశారు. కాగా ఇక్కడ సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి సర్వే చేయగా చాలా మంది ఈ ప్రాంతంలో ఉండటం లేదని తెలిసింది. లక్ష్మీనగర్‌లో పైలట్ ప్రాజెక్టు కింద సర్వే కోసం 567 పేర్లను ఫోన్ నెంబర్లను ఇవ్వగా ఇక్కడ కేవలం 192 మంది మాత్రమే ఉన్నట్లు తేలింది. అదీ లక్ష్మీనగర్‌లో కాకుండా ఖైరతాబాద్ మొత్తం విస్తరించి ఉన్నట్లు, ఫోన్ నెంబర్ల ఆధారంగా వారి చిరునామాలు తీసుకొని వివరాలు సేకరించినట్లు తెలిసింది. చాలా ఫోన్ నెంబర్లు పనిచేయడం లేదని సర్వేలో విస్తృ తంగా గాలించి వారికి సంబంధించిన వివరా లతో పాటు ఆధార్ వివరాలు సేకరించి వాటిని పొందుపర్చామని సిబ్బంది తెలిపారు. చాలా మంది లక్ష్మీనగర్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లారని, మిగతా వారు అక్కడ కాకుండా ఖైరతాబాద్‌లోనే పలు ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన వివరాలు చాలా పాతవని కొందరు తెలిపారు.

నేటి నుంచి 22 వరకు చెత్త తరలింపు ప్రత్యేక డ్రైవ్

గచ్చిబౌలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఆయా ప్రాంతాల్లోని చెత్తను వాహనాల్లో తరలిస్తామని అందుకోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఉపకమిషనర్ ముకుందారెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి ఆదేశాల మేరకు ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకు ఈ స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు.

పెంపుడు కుక్కలకు లైసెన్సులు తీసుకోవాలి

గచ్చిబౌలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ అన్ని సర్కిళ్ల పరిధిలోని కుక్కలు పెంచుకునే యజమానులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని వెస్ట్‌జోన్ వెటర్నరీ డైరెక్టర్ డాక్టర్ జోషఫ్ తెలిపారు. ఇటీవల కుక్కల దాడిలో చిన్నపిల్లలు మృత్యువాత పడటం, పిల్లలు, పెద్దలు కుక్కకాటుకు గురికావడం జరుగుతోందన్నారు. కుక్కలను పెంచుకునే వారు తప్పనిసరిగా లైసెన్స్‌లు తీసుకోవాలని, లేనిచో జీహెచ్ఎంసీ చట్టపరంగా వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని డాక్టర్ జోషఫ్ తెలిపారు. లైసెన్స్ తీసుకోవాల్సిన విధానంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని పేర్కొన్నారు.

మద్యం మత్తులో గుడిలో రాళ్లు విసిరాడు

అంబర్‌పేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాత్రి 11 గంటల సమయంలో గుడి తలుపులు తెరవనందుకు మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి గుడిలో రాళ్లు వేసిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ అశోక్ తెలిపిన ప్రకారం. బాగ్‌అంబర్‌పేట ధోబీగల్లీ నివాసి మహేష్ రాత్రి 11గంటల సమయంలో మద్యం తాగి అంబర్‌పేట మహాకాళి ఆలయానికి వచ్చాడు. గుడి తలుపులు తెరవమని సెక్యూరిటీ గార్డును కోరాడు. గార్డు గుడి తలుపులు తెరవలేదు, దీంతో మహేష్ అక్కడే ఉన్న కొన్ని రాళ్లను తీసుకుని గుడిలో వేశాడు, విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు వెంటనే గుడివద్దకు వచ్చి అతడ్ని అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌డీఎన్ వైద్య చికిత్సతో వృద్ధుడి ప్రాణాలను కాపాడిన వైద్యులు

బంజారాహిల్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అధిక రక్తపోటు, మధుమేహం, తీవ్రమైన హృద్రోగ సమస్యలతో బాధప డుతున్న 74 ఏళ్ల వృద్ధుడికి అధునాతన ఆర్‌డీఎన్ (రేనల్ డినర్వేషన్ ట్రీట్మెంట్) వైద్య విధానంలో బంజారాహిల్స్ కేర్ ఆసుపత్రి వైద్యులు చికిత్స అందించి స్వాంతన చేకూర్చారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అజిత్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం... చిక్కడపల్లికి చెందిన వృద్ధు డు అధిక రక్తపోటు, మధుమేహం, కరోనరీ ఆర్టరీ డిసీజ్ తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గతంలోనే కరోనరీ యాంజియోప్లాస్టీ చేయించుకున్నారు. అయినప్పటికీ ప్రమాదకర రక్తపోటు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రాణాపాయస్థితిలో బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో చేరారు. అధిక మోతాదులో ఔషధాలను వినియోగించడంతో పాటు ఆరోగ్య సమస్యలే ఇందుకు కారణమని వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో రోగి నాన్- ఇస్కీమిక్ హైపర్టెన్సివ్ లెఫ్ట్ వెంట్రిక్యులర్ వైఫల్యాన్ని పొందే ప్రమాదం పొంచి ఉండటంతో సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీఎల్ఎన్ కపర్ది రోగికి మూత్రపిండ ధమనులపై అధునాతన ఆర్‌డీఎన్ (రేనల్ డినర్వేషన్ ట్రీట్మెంట్) వైద్య విధానం ద్వారా 11 సార్లు (11 సైకిల్ అబ్లేషన్) సురక్షితమైన చికిత్సను అందించారు. చికిత్స అనంతరం వారం రోజుల్లో రోగి రక్తపోటు మెరుగుపడింది, రోగి ఆరోగ్యం సాధారణస్థితికి చేరుకోవడంతో అతడు వినియోగించే ఔషధాలను తగ్గించేందుకు వీలు కలిగిందని డాక్టర్ పీఎల్ఎన్ కపర్ది తెలిపారు.


వృద్ధుడితో వైద్యులు

ఘనంగా స్ఫూర్తి అవార్డుల ప్రదానం

చిక్కడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పినాకిని కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయగానసభలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ జయంతి సందర్భంగా స్ఫూర్తి అవార్డుల ప్రదానసభ ఘనంగా జరిగింది. ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని నల్లతీగ శ్రీనివాసాచార్యులు, నాయకంటి నరసింహశర్మ, గజవెల్లి సత్యనారాయణ, ఎస్.విజయశ్రీ, నరసింహులుగౌడ్, వేమూరి అనంతరామకృష్ణశర్మ, వేమూరి మంజుల, కుమారస్వామి, మాదరిలకు పురస్కారాలను ప్రదానం చేశారు. మధుసూదనాచారి మాట్లాడుతూ కలాం జీవితం యువతకు ఎంతో స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. నిర్వాహకులు మురళీమోహన్‌రాజు, వివి మహేశ్వరరావు, రామచంద్రరావు, అరుణజ్యోతి, రాధాకుసుమ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అమీర్‌పేటలోని ప్రధాన రహదారిపై పారుతున్న వరద

వర్షం.. రోడ్లు జలమయం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం వర్షం కురిసింది. రోడ్లపైకి భారీగా నీరు చేరింది. దీనికి తోడు మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు ఉప్పొంగడంతో రోడ్లపై భారీగా వరద నీరు పారింది. అమీర్‌పేట, బేగంపేట తదితర ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపైకి భారీగా నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.


అమీర్‌పేటలో....


బేగంపేట ప్రధాన రహదారిపై పారుతున్న వరద నీరు

స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

● బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన జరిపి స్థానికసంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర డిమాండ్ చేశారు. ప్రముఖ రచయిత, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ రచించిన 'మా వాటా మాకే' అనే పుస్తకాన్ని మంగళవారం సీనియర్ న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలతో కలిసి రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో అధికారంలోకి వస్తే కులగణన జరిపి బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే సమగ్ర కులగణన జరిపి బీసీ రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాది సదానందం మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి బీసీలకు అన్యాయం జరుగుతూ వస్తున్నదన్నారు. ఇప్పటికైనా బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి దేవరాజు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు బీసీలకు న్యాయం చేస్తామని మాట ఇచ్చారని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున ఇక జాప్యం చేయకుండా వెంటనే బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు భిక్షమయ్య, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు కళ్యాణ్, కృష్ణాగౌడ్, పాండు, సత్యనారాయణరెడ్డి, జయప్రసాద్, కిషన్, రమేష్‌యాదవ్, వెంకటకృష్ణ, శివకుమార్‌గౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రెండో అంతస్తు పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య

బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ రెండో అంతస్తు భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... నెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్న ఫౌజియా బేగం(35) మొదటి భర్తకు విడాకులు ఇచ్చి రెండో పెళ్లి చేసుకుంది. అతడితో కూడా గొడవలు జరగడంతో విడాకులు ఇచ్చి ఇంటి వద్దనే ఉంటుంది. కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఫౌజియాబేగం జీవితంపై విరక్తి చెందిన ఫౌజియాబేగం మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో తాను నివాసం ఉంటున్న రెండు అంతస్తుల భవనం పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు మహ్మద్ షకీల్ కాచిగూడ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికిచేరుకున్న పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.

కాచిగూడలో బాలిక అదృశ్యం

బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ బాలిక అదృశ్యమైంది. కాచిగూడ పీఎస్ అడ్మిని ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... చప్పల్‌బజార్‌లో నివాసం ఉంటున్న వామన్ దేవకాంత్ కుమార్తె ప్రియ(17) కోఠిలోని ఓ గోల్డ్ షాపులో ఉద్యోగం చేస్తుంది. ఈనెల 14న ఇంటి నుంచి గోల్డ్ షాపుకు వెళ్లిన ప్రియ తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు గోల్డ్ షాపు యజమానికి ఫోన్ చేయగా ఉద్యోగానికి రాలేదని చెప్పాడు. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి మంగళవారం కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.


సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ విజయారెడ్డి

స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఖైరతాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు, పురుషులకు స్వయం ఉపాధి కోసం వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని అభయ ఫౌండేషన్ కోరింది. మంగళవారం ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో జరిగిన సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులతో పాటు ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొని మహిళలకు అవగాహన కల్పించారు. టైలరింగ్, బ్యూటీషియన్, పేపర్ ప్లేట్ల తయారీ, డ్రైవింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామని అభయ ఫౌండేషన్ ఛైర్మన్ బాలచంద్ర తెలిపారు. శిక్షణ అనంతరం 70 శాతం ఫౌండేషన్ ఖర్చు, 30 శాతం లబ్ధిదారుల ఖర్చుతో కావాల్సిన యంత్రాలను అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు, పురుషులు శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

బస్తీల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించండి

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్‌లోని పలు బస్తీల్లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మంగళవారం పర్యటిం చారు. ఆయా బస్తీల్లో నెలకొన్న సమస్యలను శాఖల వారీగా వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్ వెంట అధికారులు విజయ్‌రావు, హరిశంకర్, సూర్య ప్రకాశ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

చిల్లాలో కార్పొరేటర్ ప్రత్యేక ప్రార్థనలు

బోరబండ, అక్టోబర్ 15 (ఆంధ్ర జ్యోతి): గ్యార్వీ ఉత్సవాన్ని పురస్కరించు కొని ఎస్ఆర్ఆర్ పురం సైట్-1 కాలనీ చిల్లాలో కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించి యువతకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.


చిల్లాలో ప్రార్థనలు చేస్తున్న కార్పొరేటర్ బాబా

పద్యనాటక వైభవాన్ని చాటాలి : ఓలేటి పార్వతీశం

చిక్కడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పద్యనాటక వైభవాన్ని నలుదిశలా చాటాలని సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అన్నారు. ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయ గానసభలో చింతామణి, భవాని శంకరుల ప్రణయసన్నివేశ దృశ్య ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా పార్వతీశం మాట్లాడుతూ పద్యనాటకాలు మన సంస్కృతిని, సంప్రదాయాలను ఇతరులకు పరిచయం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా నటులు చంద్రబాబునాయుడు, చాగంటి సాయిలక్ష్మి, సాయివెంకట్, వీరబ్రహ్మం, సత్యనారాయణలను సన్మానించారు. కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య పాల్గొన్నారు.


సన్మాన గ్రహీతలతో అతిథులు

యువశక్తికి సానపెడితే ఉన్నతంగా ఎదుగుతారు

చిక్కడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యువతకు సానపెడితే ఉన్నతంగా ఎదుగుతారని నవభారత్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు డా. హిప్నో పద్మకమలాకర్ అన్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలామ్ జయంతి సందర్భంగా అశోక్‌నగర్‌లోని డా. హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీకేర్ హాల్‌లో నవభారత్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'యువత సవాళ్లు' అనే అంశంపై ఉచిత సదస్సు మంగళవారం జరిగింది. ఈసందర్భంగా పద్మకమలాకర్ మాట్లాడుతూ యువత వజ్రంలాంటివారన్నారు. సమాజంలో మార్పు తేవడంతో పాటు భవిష్యత్ పటిష్ఠతను ఏర్పాటు చేయడంలో యువత కీలకపాత్ర పోషిస్తారన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు జి.కృష్ణవేణి, పి.స్వరూపరాణి, కె.శోభారాణి, తెలంగాణ ప్రోగ్రెసివ్ సైకాలజిస్టు అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రఘు తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న పద్మకమలాకర్

అక్కా అంటూనే వెకిలి చేష్టలు: యువకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అక్కా అంటూనే వెకిలి చేష్టలకు దిగిన ఓ యువకుడిపై కేసు నమోదైంది. నవోదయ కాలనీకి చెందిన గృహిణి సమీపంలోని టైలర్ షాపునకు దుస్తులు కుట్టించుకునేందుకు వెళ్లేది. ఈ క్రమంలో టైలర్ కుమారుడు రిషి ఆమెను అక్కా అని పిలుస్తూ పరిచయం ఏర్పర్చుకున్నాడు. తాజాగా ఆమెకు అసభ్యకరమైన మెస్సేజ్‌లు పంపుతూ వేధిస్తుండటంతో బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పెట్టీ కేసు పెట్టి రిషికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. కానీ తీరు మార్చుకోని అతను గృహిణిని కత్తితో బెదిరించాడు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాగులోని బంగారు ఆభరణాలు మాయం

బంజారాహిల్స్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బ్యాగులో ఉన్న బంగారు ఆభరణాలు మాయం అయ్యాయి. హన్మకొండకు చెందిన శోభాలత ఈ నెల 10న బంజారాహిల్స్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తన సోదరితో కలిసి చికిత్స నిమిత్తం వచ్చింది. మరుసటి రోజు జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 5లోని మెట్రో స్టేషన్‌లో మెట్రో ఎక్కి బస్టాండ్‌కు వెళ్లి అటు నుంచి హన్మకొండకు చేరుకున్నారు. అనంతరం ఆమె సోదరి బ్యాగు చూసుకోగా అందులో ఉండాల్సిన 12 వేల నగదు కనిపించలేదు. శోభాలత బ్యాగులో ఉండాల్సిన 5.152 గ్రాముల బంగారు ఆభరణాలు కూడా కనిపించలేదు. దీంతో బాధితురాలు ఈ నెల 14న ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


వారం రోజుల్లో 12 సెల్‌ఫోన్లు చోరీ

బంజారాహిల్స్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయంలో దొంగలు రెచ్చిపోయారు. దేవీశరన్నవరాత్రి వేడుకల్లో భక్తుల వద్ద నుంచి 12 సెల్‌ఫోన్‌లు చోరీ అయ్యాయి. తాజాగా బోడుప్పల్‌కు చెందిన దాసరి చాందిని అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఈ నెల 13న దసరా సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చారు. పూజలు ముగించుకొని బయటకు వచ్చేసరికి ఆమె బ్యాగులో ఉండాల్సిన మొబైల్ ఫోన్ కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వలేదని స్నేహితుడి కిడ్నాప్

ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వడంలేదని స్నేహితుడిని కిడ్నాప్ చేసిన ఘటనలో ఫలక్‌నుమా పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఫలక్‌నుమా ఏసీపీ కార్యాయంలో ఏసీపీ ఎంఏ జావిద్, ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి వివరాలను వెల్లడించారు. ఫలక్‌నుమా బీబీకా చస్మా ప్రాంతానికి చెందిన జుబేర్ యాకుత్‌పురా రైన్‌బజార్‌కు చెందిన మహ్మద్ హమీద్ వద్ద రెండు నెలల క్రితం రూ.30 వేల విలువైన వాషింగ్ మెషీన్, రిఫ్రిజిరేటర్ తీసుకున్నాడు. జుబేర్ ఎంతకీ డబ్బులు ఇవ్వకపోవడంతో అతడి స్నేహితుడైన మహ్మద్ అలీని కిడ్నాప్ చేశారు. మహ్మద్ హమీద్ (24), మహ్మద్ సిరాజ్‌ఖాన్ (42), వట్టేపల్లికి చెందిన అమ్జద్‌ఖాన్ (38), షాహీన్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఖాజా షర్ఫుద్దీన్ అలియాస్ సయ్యద్ ఉబేద్(24), కామాటిపురాకు చెందిన మహ్మద్ రహీంపాషా(37), బార్కస్‌కు చెందిన మహ్మద్ ఆసిఫ్(25) ఈ నెల 13న రాత్రి అలీని కిడ్నాప్ చేశారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కిడ్నాపర్లు కర్ణాటకలోని గుల్బార్గాలో ఉన్నట్లు గుర్తించి, అక్కడి పోలీసుల సాయంతో నిందితులను అరెస్టు చేశారు. అలీ కిడ్నాప్‌కు రెండు రోజుల ముందు జుబేర్ తమ్ముడిని బెదిరించి ద్విచక్రవాహనం లాక్కురని తెలిసింది.


పోలీసుల అదుపులో ఉన్న నిందితులు




ట్రాన్స్‌ఫార్మర్‌కి అల్లుకుపోయిన తీగలు, వంగిన ఫ్యూజ్ బాక్స్

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చిలకలగూడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ చింతబావి వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కి చెట్ల కొమ్మలు, తీగలు అల్లుకుపోయి ఫ్యూజ్ బాక్స్‌లు కిందకి వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం వుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరుగకుండా విద్యుత్ అధికారులు వెంటనే తగు జాగ్రత్తలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలో మహాకాళి అమ్మవారి ఆలయం

కార్పొరేటర్‌ను మా బస్తీకి రానివ్వం: స్థానికులు

- ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చి మరిచిన కార్పొరేటర్

అడ్డగుట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలో ఉన్న మహాకాళి అమ్మవారి ఆలయాన్ని సొంత ఖర్చులతో అభివృద్ధి చేస్తానని అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి హామీ ఇచ్చి మరిచిపోయారని ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక సార్లు కార్పొరేటర్ దృష్టికి తీసుకొస్తే పట్టించుకోవడంలేదని తమకు మాయ మాటలు చెప్పారంటూ ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. కార్పొరేటర్ ఇచ్చిన మాట ప్రకారం ఆలయ ప్రాంగణంలో బండలు, గేటు ఏర్పాటు చేయకపోతే బస్తీలో రానివ్వమని హెచ్చరించారు. ఇదే విషయంపై సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. రెండు రోజుల్లో ఏదో ఒక విషయం తెలపాలని లేకపోతే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్లి నిరసన వ్యక్తం చేస్తామని స్థానికులు హెచ్చరించారు.

అర్హులైన వారికి రుణాలు అందే విధంగా చూడాలి: రామలీల

అడ్డగుట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి రుణాలు అందే విధంగా చూడాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు రామలీల అన్నారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె అడ్డగుట్టలో మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి రుణాలు, సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని చైర్మన్ హామీ ఇచ్చారని అన్నారు.

ఇందిరమ్మ కమిటీ వేసిన తరువాత ప్రతి పేదవాడికి న్యాయం చేస్తానన్నారు. చైర్మన్ కలిసిన వారిలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాళ్లు లలిత, వరలక్ష్మిలు ఉన్నారు.



ఎస్సీ చైర్మన్ ప్రీతంను కలిసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు రామలీల

బీఆర్ఎస్ పూర్వ వైభవానికి కృషి: శ్రీనివాస్

సికింద్రాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్టు బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్. శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న కంటోన్మెంట్‌లో గడిచిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని, మళ్లీ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. మంగళవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి కంటోన్మెంట్ రాజకీయాల గురించి వివరించినట్టు ఆయన మీడియాకు వెల్లడించారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని, అధిష్ఠానం అండదండలు ఎప్పటికీ ఉంటాయని కేటీఆర్ చెప్పారని శ్రీనివాస్ తెలిపారు.



కేటీఆర్‌తో శ్రీనివాస్



చిన్నతోకట్ట కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేసిన రజక సంఘం సభ్యులతో జంపన ప్రతాప్

రజక సంఘం ప్రజలు ప్రత్యేక పూజలు

బోయిన్‌పల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి సెవెన్ టెంపుల్ రజక సంఘం ఆధ్వర్యంలో చిన్నతోకట్ట కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. రజక సంఘం దోబీఘాట్ ఏర్పాటుకు జంపన ప్రతాప్ ఎంతో కృషి చేశారని, ఆయనను శాలువతో సత్కరించారు.

కార్యక్రమంలో యాదయ్య, నర్సింగ్‌రావు, రాములు, బాల్‌రాజ్, భుజేందర్, జాంగీర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జెడ్సీ ఆదేశాలు బేఖాతర్!

- ప్రధాన ప్రాంతాల్లో వర్షపునీటి తొలగింపులో బేగంపేట సర్కిల్ యంత్రాంగం నిర్లక్ష్యం
- రోజుల తరబడి వర్షపునీరు నిల్వ
- దుర్గంధంగా మారుతున్న రోడ్లు
- బాటసారులు, వాహనదారులకు అవస్థలు

సికింద్రాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ప్రాంతాల్లో నిలిచే వర్షపునీటిని తక్షణమే తొలగించాలని, తద్వారా బాటసారులు, వాహనదారులకు అసౌకర్యం కలగకుండా చూడాలంటూ జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ (జెడ్సీ) కమిషనర్ రవికిరణ్ తరచూ జారీ చేస్తున్న ఆదేశాలను బేగంపేట సర్కిల్ యంత్రాంగం బేఖాతర్ చేస్తోంది. అంతర్గత రోడ్ల మాట అటుంచితే... ప్రధాన రహదారులపై రోజుల తరబడి వర్షపు నీరు నిలిచి ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చిన్నపాటి వర్షానికే వర్షం నీరు నిలిచిపోయి, వారాల తరబడి నిల్వ ఉంటోంది. దీంతో ఇక్కడ దుర్గంధ భరితంగా మారడంతో పాటు దోమలు పెరిగిపోతున్నా అటు ఇంజినీరింగ్ విభాగం అధికారులకు, ఇటు పారిశుధ్య నిర్వహణ అధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే ప్యాట్నీ-బేగంపేట ప్రధాన రహదారిలోని పలు ప్రదేశాల్లో వర్షపునీరు నిలిచిపోయి ట్రాఫిక్‌కు విఘాతం కలుగుతోంది. వాహనాలు రాకపోకల సమయంలో ప్రయాణికులపై ఈ వర్షపునీరు పడటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ నిర్వహించే ప్రతీ సమీక్ష సమావేశంలోనూ ముఖ్యంగా వర్షాకాలం సీజన్‌లో ఈ అంశాన్ని లేవనెత్తడం, దానిని బేగంపేట సర్కిల్ అధికారులు పెడచెవిన పెట్టడం పరిపాటిగా మారింది.

- భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో సైతం జోనల్ కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ, వర్షపునీరు రోడ్లపై ఎక్కువ సేపు నిలవకుండా, నాలాల్లో సాఫీగా ప్రవహించేలా చూడాలని సూచిస్తున్నారు. ఆయన ఆదేశాలుగానీ, సూచనలుగానీ అమలు కాకపోవడంపై జీహెచ్ఎంసీ ఉద్యోగులే విస్మయం వ్యక్తం చేసున్నారు.
- సికింద్రాబాద్‌లోని స్విమ్మింగ్ ఫూల్, పరేడ్ గ్రౌండ్ ఎదురుగా, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు వద్ద, ఫైర్ స్టేషన్, పీజీ కళాశాల ఎదురుగా హనుమాన్ టెంపుల్ తదితర కీలక ప్రదేశాల్లో సైతం రోజుల తరబడి వర్షపునీరు నిలిచిపోయినా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్త మవుతున్నాయి.

జీహెచ్ఎంసీ అధికారుల తీరు సికింద్రాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను సైతం దెబ్బ తీస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్యారడైజ్ ఫైర్ స్టేషన్ ఎదురుగా నిలిచిన వర్షపు నీరు



పరేడ్‌గ్రౌండ్ ఎదురుగా ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు



సికింద్రాబాద్ స్విమ్మింగ్ ఫూల్ బస్టాప్ వద్ద నిలిచిన వర్షపు నీరు

సాయిబాబా మృతికి కేంద్రమే బాధ్యత వహించాలి

- తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ యాదగిరి

అడ్డగుట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా హక్కుల ఉద్యమకారుడు ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా తీవ్ర అనారోగ్యంతో మృతి చెందడం బాధకరమని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ ఎస్. యాదగిరి అన్నారు. మంగళవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రానికి ప్రజల హక్కుల మీద, ప్రజాస్వామ్యం మీద ఏమాత్రం గౌరవం లేదన్నారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన ప్రొఫెసర్ ఆశయ సాధన కోసం పనిచేస్తామని ప్రజల హక్కులను కాలరాస్తున్న కేంద్రానికి తగిన బుద్ధి చెబుతామన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాది ప్రభుత్వ హత్యే

ప్రొఫెసర్ సాయిబాబా మరణం హక్కుల ఉద్యమానికి తీరనిలోటని ముమ్మాటికీ ఇది ప్రభుత్వ హత్యేన్నారు. తన జీవితం చివరి శ్వాస పీడిత ప్రజల గొంతుకగా నిలబడ్డారన్నారు. అక్రమ కేసులు పెట్టి అన్యాయంగా ఏళ్ల తరబడి జైల్లో పెట్టి వైద్య పరీక్షలు చేయకుండా కేంద్రం నిర్లక్ష్యం వహించిందన్నారు. సాయిబాబా మృతికి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.



బాధితురాలి కుటుంబ సభ్యుడికి ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

వైద్య సేవల కోసం ఎల్ఓసీ అందజేత

మారేడుపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ బండ మైసమ్మ నగర్‌కు చెందిన శోభ అనారోగ్యంతో బాధపడుతున్నది. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆశ్రయించి మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరింది. ఎమ్మెల్యే తలసాని చొరవతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసింది. వైద్యం కోసం మంజూరైన లక్ష రూపాయల ఎల్ఓసీ పత్రాన్ని శోభ కుమారుడు మహేష్‌కు మంగళవారం ఎమ్మెల్యే అందజేశాడు. కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీపతి పాల్గొన్నారు.



విరాళం

ఆంధ్రప్రదేశ్‌లోని వరద బాధితుల సహాయార్థం తెలంగాణలో పలువురు దాతల ద్వారా సేకరించిన రూ.6 లక్షల విరాళాల మొత్తాన్ని డీడీ రూపంలో మంగళవారం ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని ఆయన కార్యాలయంలో కలిసి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్, పరిటాల విజ్ కుమార్, అడుసుమిల్లి చిట్టి పిఠయ్య, తలశిల సీతారామయ్య, నరేంద్రబాబు కాట్రగడ, నల్లారి ప్రసాద్, తోట చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సనాతన ట్రస్ట్ వ్యవస్థాపకులు సుబ్రహ్మణ్యం తదితరులు

ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సనాతన ట్రస్ట్ సౌజన్యంతో నల్లగుట్ట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. పాఠశాలలోని 7 తరగతి గదుల్లో సీసీ కెమెరాలు, 7 డిజిటల్ క్లాసుల ఆధునీకరణ కోసం ట్రస్ట్ వ్యవస్థాపకుడు సుబ్రహ్మణ్యం ఆయన సతీమణి పద్మశ్రీ జ్ఞాపకార్థం పాఠశాల కోసం లక్ష రూపాయలు వెచ్చించారు. అందులో భాగంగా కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నభత్తిని శౌరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గా దేవి విగ్రహ నిమజ్జనం

బౌద్ధనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని పలు మండపాల్లో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారు పదిరోజుల పాటు పూజలందుకుని నిమజ్జనానికి తరలివెళ్లారు. వారాసిగూడ ఓల్డ్ పద్మాగ్యాస్ లేన్‌లో ఏర్పాటుచేసిన మండపం నుంచి కనకదుర్గ అమ్మవారిని నిమజ్జనానికి సోమవారం రాత్రి తీసుకువెళ్లారు. సంజీవపురంలో జైభారత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో కనకదుర్గ అమ్మవారిని నిమజ్జనం చేయటానికి నిర్వాహకులు సోమశిలకు తీసుకువెళ్లారు. వేడుకల్లో శైలేందర్, రాజేశ్వర్, నర్సింగ్, రాజుసాగర్, సురేష్, వనమాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జనానికి తరలివెళ్లుతున్న కనకదుర్గ అమ్మవారు



దసరా సమ్మేళన్‌లో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు

ఎస్‌టీయూటీ ఆధ్వర్యంలో ఘనంగా దసరా సమ్మేళన్

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (ఎస్‌టీయూటీ) సికింద్రాబాద్ మండల్ ఆధ్వర్యంలో మంగళవారం కలాసీగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దసరా సమ్మేళన్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామసుబ్బారావు మాట్లాడుతూ అన్ని టీచర్స్ యూనియన్‌లకతీతంగా దసరా సమ్మేళన్‌ను నిర్వహించడం అభినందనీయమని సికింద్రాబాద్ మండల కమిటీని అభినందించారు. మండల కమిటీ అధ్యక్షుడు హనుమంతు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణలు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా యూనియన్లకతీతంగా అందరు ఉపాధ్యాయులతో కలిసి దసరా సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని, సికింద్రాబాద్ మండలం నుండే కాక ఇతర మండలాల నుంచి దాదాపు 200 మందికి పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఇఫ్తెకారుద్దీన్, నర్సింహ రెడ్డి, రాష్ట్ర నాయకులు శైలేంద్ర కుమార్, జిల్లా నాయకులు చార్లెస్, వెంకటేష్, భూపాల్, మండల ఉపాధ్యక్షురాలు అరుణ, కార్యదర్శి సునీత యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

రెండో అంతస్తు పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య

బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ రెండో అంతస్తు భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... నెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్న ఫౌజీయాబేగం(35) మొదటి భర్తకు విడాకులు ఇచ్చి రెండో పెళ్లి చేసుకుంది. అతడితో కూడా గొడవలు జరగడంతో విడాకులు ఇచ్చి ఇంటి వద్దనే ఉంటుంది. కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఫౌజీయాబేగం జీవితంపై విరక్తి చెందిన ఫౌజీయాబేగం మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో తాను నివాసం ఉంటున్న రెండు అంతస్తుల భవనం పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు మహ్మద్ షకీల్ కాచిగూడ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికిచేరుకున్న పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.

స్థానికసంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన జరిపి స్థానికసంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర డిమాండ్ చేశారు. ప్రముఖ రచయిత, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరీ గౌరీ శంకర్ రచించిన 'మా వాటా మాకే' అనే పుస్తకాన్ని మంగళవారం సీనియర్ న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలతో కలిసి రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో అధికారంలోకి వస్తే కులగణన జరిపి బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే సమగ్ర కులగణన జరిపి బీసీ రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాది సదానందం మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి బీసీలకు అన్యాయం జరుగుతూ వస్తున్నదన్నారు. ఇప్పటికైనా బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి దేవరాజు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు బీసీలకు న్యాయం చేస్తామని మాట ఇచ్చారని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున ఇక జాప్యం చేయకుండా వెంటనే బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు భిక్షమయ్య, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు కళ్యాణ్, కృష్ణాగౌడ్, పాండు, సత్యనారాయణరెడ్డి, జయప్రసాద్, కిషన్, రమేష్‌యాదవ్, వెంకటకృష్ణ, శివకుమార్‌గౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో 'మా వాటా మాకే' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపేంద్ర, న్యాయవాదులు

మద్యం మత్తులో గుడిలో రాళ్లు విసిరాడు

అంబర్‌పేట, అక్టోబరు 15(ఆంధ్ర జ్యోతి): సోమవారం రాత్రి 11గంటల సమయంలో గుడి తలుపులు తెరవనందుకు మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి గుడిలో రాళ్ల వేసిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ అశోక్ తెలిపిన ప్రకారం. బాగ్‌అంబర్‌పేట ధోబీగల్లీలో నివాసం ఉండే మహేష్ రాత్రి 11 గంటల సమయంలో మద్యం తాగి అంబర్‌పేట మహాకాళి అమ్మవారి ఆలయానికి వచ్చాడు. గుడి తలుపులు తెరవమని సెక్యూరిటీ గార్డును కోరాడు. సెక్యూరిటీగార్డు గుడి తలుపులు తెరవలేదు, దీంతో మహేష్ అక్కడే ఉన్న కొన్ని రాళ్లను తీసుకుని గుడిలో వేశాడు. విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు వచ్చి అతన్ని పట్టుకుని అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు.



నివాళి

భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతిని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి మంగళవారం తార్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. - తార్నాక, ఆంధ్రజ్యోతి



ప్రత్యేక పూజలు

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తార్నాకలోని చింతల్ బస్తీలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి